

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**MAY - 2011**

సంవత్సర చందా రూ. 50/-

# సంక్షిప్త వార్తలు

2011 ఏప్రియల్ 6వ తేదీన రిక్కీ గూటంగారు సతీసమేతముగాను, వారి కుమారుడు జస్టిన్ గూటం గారితోను విశాఖపట్టణం మీదుగా అమెరికా ప్రయాణమై 8వ తేదీ అర్ధరాత్రి వేళకు అమెరికా క్షేమముగా చేరుకొనిరి. అక్కడ వారు పలుసంఘాలను దర్శించి భారతదేశములో ఆయన చేయు చున్న పనిని గూర్చి వారికి వివరింతురు. మరియు రోటరీ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్సులో పాల్గొందురు.

ఏప్రియల్ 14వ తేదీ గురువారం ఉదయం పెదగంట్యాడ, గాజువాకలో యున్న విశాఖవేలీ బైబిలు కాలేజీ విద్యార్థుల యొక్క ప్రధమ గ్రాడ్యుయేషన్ ఉత్సవము ఘనముగా జరిగెను. పట్టభద్రులైన 16 మందికి బైబిలులో బి.ఏ, డిగ్రీ ప్రసాదించబడెను. అమెరికా నుండి సోదరుల జెర్రీబేట్స్ గారు సతీసమేతముగా ఈ కార్యక్రమమునకు ప్రత్యేకముగా హాజరై విద్యార్థులకు డిగ్రీలు ప్రదానము చేసిరి. ఈ కార్యక్రమమునకు పలుప్రాంతముల నుండి వచ్చిన క్రీస్తు సంఘబోధకులు, సభ్యులు, పట్టణ ప్రముఖులు, రాజకీయనాయకులు హాజరై విశాఖ వేలీ బైబిలు కాలేజీ డైరక్టర్ యమ్. సామ్యేలు రాజు గారును, కాలేజీ డీన్, యమ్. జాన్‌డీన్ గారును, ప్రిన్సిపాల్ యమ్. విజయ కుమార్ గారును దేవునికి చేయుచున్న పనిని అభినందించిరి.

బైబిలు డిగ్రీ పట్ట ప్రదాన కార్యక్రమములో సోదరులు డేవిడ్ యమ్. చుక్కాగారును, జాషువాగూటం గారును సందర్భాను సారమైన చక్కటి వాక్య సందేశములనిచ్చిరి. విద్యార్థులకు ఆయా సర్టిఫికేట్లు, మెడల్స్ వగయిరాలు సోదరి పాలా బేట్స్, కబితా గూటం, జాషువా గూటం, ఆర్.సి.హెచ్. సద్గుణరావ్ గార్ల చేతుల మీదుగా అందియ్యబడెను. విశాఖవేలీ బైబిలు కాలేజీ డైరక్టర్ యమ్. సామ్యేలు

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 31 | మే - 2011 | సంచిక -10


## నీ తలంపులను అదుపులో యుంచుకోవాలి
## (Control Your Thoughts)

"మెట్టుకు సహోదరులారా, యే యోగ్యతయైనను మెప్పైనను ఉండిన యెడల ఏవి సత్యమైనవో, ఏవి మాన్య మైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమై నవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతి గలవో వాటి మీద ధ్యానముంచుకొనుడి" యని ఫిలిప్పీ 4:8 లో అపొ.పౌలు వ్రాసాడు.

యేసుక్రీస్తు వలన కలుగు సమాధానము మన హృదయములకును, తలంపులకును కావలి యుండుట అత్యవసరం. మనుష్యులు ఎంత మంచి వారైనను వారి హృదయాల్లో చెడు తలంపులు రాక మానవు. అట్టి తలంపులు వచ్చుట పాపము కాదుగాని, వాటి యందే మన ధ్యానముంచుకొని వాటికి క్రియా రూపము గావించుట పాపము. చెడు తలంపులు మన తలలో గూళ్లు కట్టు కోకుండా మనం తప్పక ప్రయత్నించాలి.

చెడు తలంపులను మన మనస్సు నుండి తరిమి వేయాలి. దేవుని గూర్చిన జ్ఞానమును అడ్డగించు ప్రతి ఆటంకమును

పడ(ద్రోయాలని అపో.పౌలు చెప్పుచున్నాడు (2 కొరింధీ 10:5). "కాబట్టి మీ మనస్సు అను నడుము కట్టుకొని నిబ్బరమైన బుద్ధిగలవారై, యేసు క్రీస్తు ప్రత్యక్షమైన ప్పుడు మీకు తేబడు కృప విషయమై సంపూర్ణ నిరీక్షణ కలిగి యుండుడి" (1 పేతురు 1:13).

మనం విను దానిని బట్టి, చూచు దానిని చదువు దానిని బట్టి మన తలంపులు ఏర్పడును, లేక నడిపింపబడును. గనుక మన తలంపులను అదుపులో యుంచుకోవాలంటే ఈ మూడింటి విషయము జాగ్రత్త కలిగియుండాలి, పాపము చేయకుండునట్లు దేవుని వాక్యాన్ని మన హృదయంలో దాచి యుంచుకోవాలి. "నీ యెదుట నేను పాపము చేయకుండు నట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొని యున్నానని" దావీదు మహా రాజు పలికాడు (కీర్తన 119:11).

139వ కీర్తనలో దావీదు వ్రాసిన ప్రార్థన మన ప్రార్థనయై యుండాలి. "దేవా నన్ను పరిశోధించి నా హృదయమును తెలిసికొనుము. నన్ను పరీక్షించి నా ఆలోచ నలు తెలిసికొనుము. నీకాయసకరమైన మార్గము నా యందున్నదేమో చూడుము. నిత్యమార్గమున నన్ను నడిపింపుము" (కీర్త 139:23,24).

చెడుతలంపులు, చెడు అలవాట్లు మన యొద్దకు రాకుండాలంటే మనం కొన్నిమంచి అలవాట్లను అలవరచు కోవాలి.

ప్రతి దినము బైబిలును చదువు కోవాలి, దాన్ని అలవాటు చేసుకోవాలి. మన శరీరాలకు ప్రతి దినం ఆహారం ఎట్లవుసరమో, అట్లే మన ఆత్మకు ఆత్మీయా హారం అవుసరం. "ప్రభువు దయాళుడని మీరు రుచిచూచి యున్న యెడల సమ స్తమైన దుష్టత్వమును, సమస్తమైన కపటమును, వేషధారణను, అసూయను, సమస్త దూషణ మాటలను మాని క్రొత్తగా జన్మించిన శిశువును పోలినవారై నిర్మలమైన వాక్యమను పాలవలన రక్షణ విషయ ములో ఎదుగు నిమిత్తము ఆ పాలను ఆపేక్షించుడి" యని అపో. పేతురు చెప్పు చున్నాడు (1పేతురు 2:1-3).

ఉదయమే లేచి వార్తా పత్రిక నెట్లు చదువుతామో, అట్లే బైబిలును చదువుట కూడ అలవాటు చేసికోవాలి. కనీసం ఒక గంట మట్టుకు దేవుని వాక్యము చదువు టకు సమయం కేటాయించ గలిగితే మంచిది.

అట్లే ప్రతి దినము ప్రార్థన చేయుట కూడ అలవాటు చేసుకోవాలి. "యెహోవా, నాకంఠస్వరము నీకు వినబడును. ఉదయమున నా ప్రార్థన నీ సన్నిధిని సిద్ధ ము చేసి కాచి యుందును" అని దావీదు పలికాడు (కీర్తన5:3). "సాయంకాలము ను, ఉదయమున,

మధ్యాహ్నమున నేను ధ్యానించుచు మొర్ర పెట్టుకొందును. ఆయన నా ప్రార్థన నాలకించును" అని అతడు మరల పలికాడు (కీర్తన 55:17). "నిరీక్షణ గలవారై సంతోషించుచు, శ్రమయందు ఓర్పు గలవారై, ప్రార్థన యందు పట్టుదల కలిగి యుండుడి" యని అపొ.పౌలు హెచ్చరించాడు (రోమా 12:12). పాత నిబంధనలో దానియేలు మంచి ప్రార్థనపరుడు, క్రొత్త నిబంధనలో యేసుక్రీస్తు కూడ ప్రార్థన చేయుటయందు మనకు మంచి మాది రిని అనుగ్రహించారు.

ప్రతిదినము కుటుంబ ప్రార్థన చేసుకొనుట అలవాటు చేసుకోవాలి. కలిసి ప్రార్థించే కుటుంబము కలిసి మెలిసి యుంటాది (The Family that prays together stays together) "ఇశ్రాయేలూ వినుము, మన దేవుడైన యెహోవా అద్వితీయుడగు యెహోవా, నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణా త్మతోను, నీ పూర్ణశక్తితోను నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను. నేడు నేను నీకాజ్ఞాపించు ఈ మాటలు నీ హృదయములో ఉండవలెను. నీవు నీ కుమారులకు వాటిని అభ్యసింపజేసి, నీ యింటి ద్వారబంధముల మీదను నీ గవునుల మీదను వాటిని వ్రాయవలెను" అని దేవుడైనయెహోవా ఇశ్రాయేలీయుల నాజ్ఞాపించెను (ద్వితీ 6:4-9).

కుటుంబమంతయు కూడుకొని, పాటలు పాడి, బైబిలు చదువుకొని ప్రార్థించిన యెడల అది బిడ్డలకు మంచి మాదిరియగును. పెద్దలను దేవుని సేవకు బలముగా ప్రోత్సహించును. గనుక అనుదినము కుటుంబ ప్రార్థనకు సమయం కేటాయించండి.

అట్లే కుటుంబమంతయు కలిసి సంఘారాధనలకు హాజరు అవ్వండి. ఆదివారము సమీపించుచున్నదంటేనే ఆరాధనకు వెళ్లుటకు సంతోషముతో సిద్ధపడాలి. "యెహోవా మందిరమునకు వెళ్లుదమని జనులు నాతో అనినప్పుడు నేను సంతోషించితిని" అని దావీదు పలికాడు (కీర్తన 122:1). ఆదిమ క్రైస్తవులు దేవుని ఆరాధించుటలో ఎడతెగక యుండిరి. వారు అపొస్తలుల బోధయందును, ప్రార్థన యందును, సహవాసములోను, రొట్టె విరుచుటలోను కానుకలిచ్చుటలోను ఎడతెగక యుండిరి (అపొ.కా. 2:42). కాబట్టి "కొందరు మానుకొను చున్నట్టుగా సమాజముగా కూడుట మానక, ఒకనినొకడు హెచ్చరించుచు, ఆదినము సమీపించుట మీరు చూచినకొలది మరి యెక్కువగా ఆలాగు చేయుచు, ప్రేమ చూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్పవలెనని ఆలోచింతము" (హెబ్రీ

10:25).

ఈ విధంగా ఒకని జీవితంలో మంచి అలవాట్లు అలవరచుకొవాలంటే, కొన్ని చెడు అలవాట్లను కూడ దూరముగా పారద్రోలాలి. మద్యపానము సేవించుట, ధూమ్రపానము చేయుట, అబద్ధములు బూతులు మొదలైనవి చెప్పుట మాను కోవాలి. "విను వారికి మేలు కలుగునట్లు అవసరమును బట్టి క్షేమాభివృద్ధికరమైన అనుకూల వచనమే పలుకుడి గాని, దుర్భాషయేదైనను మీనోట రానియ్యకుడి" (ఎఫెసీ 4:29).

దురలవాటుకు లోనైనవారు దాన్ని విసర్జించుటకు హృదయ పూర్వకముగా నిశ్చయించుకోవాలి, దాన్ని అసహ్యించు కోవాలి. దాన్ని విసర్జించుటలో దేవుని సహాయాన్ని అభ్యర్థించాలి. ఏలయనగా క్రీస్తుద్వారా ఆయన అనుగ్రహించిన శక్తిని బట్టి మనం దేనినైనా చేయగలం (ఫిలిప్పి 4:13). దురలవాటును విసర్జిం చుటలో నీ సహోదరుల యొక్కయు, మిత్రుల యొక్కయు సహాయమును అంగీ కరించుము. విడిచిపెట్టిన దురల వాట్లును మళ్లీ దరికిరానీయకు, గాని నీవైతే యేసు ప్రభువు దగ్గరకురా. ఆయన యందు విశ్వసించి, పాపముల విషయమై మారు మనస్సుబొంది బాప్తిస్మము పొందుము నీవు నూతన సృష్టివగుదువు.!!!

క్రైస్తవరుజువులు :

## పురావస్తు శాస్త్రము నుండి ఋజువు
## (Evidence from Archaelogy - 2)

బైబిలులో గాక వేరే చోట ఎక్కడ బైబిలు వ్యక్తుల యొక్కయు బైబిలు సంఘటనలు యొక్కయు సందర్భమును కనుగొనకపోతే అవి నమ్మదగినవి కావని విమర్శకులు నిరాకరించడం ఎందువల ననో పరిపాటియైపోయినది. గాని బైబిలు యొక్క చారిత్రక వాస్తవికతను బయలు పరచు పురాతన శిలాఫలకములు, పురాతన సామాగ్రి మొ॥నవి కనుగొనబడ గానే వారందరు తలవంపులు పాలయ్యారు. పురాస్తు శాస్త్రము మనకను గ్రహించు చున్న రుజువులను ఈ పాఠంలో కూడ పరిశోధింతము :

**యాహ్వే యొక్క గృహము (The House of Yahweh)**

1970కి ముందు సొలొమోను

యెరూషలేములో నిర్మించిన ఆలయము ఒక మర్మముగా యుండేది. సొలొమోను నిర్మించిన 'యావ్హేమందిరము' అసలు లేనేలేదని కొందరు తలంచారు.

ఆ ఆలయ నిర్మాణ వివరములు 1 రాజులు 6:2-38లో ఇయ్యబడి యున్నవి. క్రీ॥పూ 586లో బబులోను రాజైన నెబుకద్నెజరుచే ఈ ఆలయము నాశనము గావించబడెను. క్రీ॥పూ 535లో యెరుబ్బాబెలు అదే స్థలములో యిది వరకటి కంటే చిన్న సైజులో దానిని నిర్మించుటకు పునాది వేసెను.

ఈ రెండవ ఆలయమును హేరోద్ దిగ్రేట్ అను రాజు పెద్దది చేయించెను. గాని అది క్రీ॥శ 70 సం॥లో టైటస్ అను రోమా చక్రవర్తి వలన నాశనము చేయబడెను.

1800 సం॥లో పురావస్తు శాస్త్రజ్ఞులు యెరుబ్బాబెలు, హేరోదులు నిర్మించిన ఆలయము యొక్క పునాదులు కనుగొనిరి. గాని సొలొమోను నిర్మించిన ఆలయావశేషములు వారు కనుగొన లేకపోయిరి.

1973లో హెబ్రీ యూనివర్సిటీలో ప్రొఫెసరుగా పనిచేయుచున్న బెంజమిన్ మజార్ అనునతడు సొలొమోను నిర్మించిన ఆలయమును కనుగొనుటకు తీవ్ర ప్రయత్నము చేయనారంభించెను. తదుపరి అయిదు సంవత్సరాల్లో అతని బృందము అనేక సంగతులను కనుగొనిరి. వాటిలో సొలొమోను నిర్మించిన దేవాలయ స్థంభములు పునాదులు, అతి పరిశుద్ధస్థలము యొక్క ఆవరణము, ఆ స్థలములో 31×48 అంగుళముల చెక్క బడిన స్వల్ప గొయ్యి కనుగొనబడెను. ఆ గోతిలో నిబంధన మందసము ఉంచబడేది.

సొలొమోను దేవాలయపు దిగువ భాగములో వారు అనేక సొరంగములు, అర్ధవర్తులాకారములో యున్న వసారాలు, నీటితొట్టెలు మొ॥లు వాటిని కనుగొనిరి.

దేవుని మందిరమును గూర్చి ప్రత్యేకముగా చెప్పు అనేక పురాతన కళాఖండములు కూడ కనుగొనబడెను. వాటిలో క్రీ॥పూ 800లో తయారు చేయబడిన కుమ్మరి సామగ్రియగు జాడీ ఒకటి. "House of Yahweh Ostracon" అని అది పిలువబడేది. Ostracon అనగా దానిపై వ్రాయబడి జాడియని అర్థము. అది నాలుగు అంగుళములు వెడల్పును. మూడున్నర అంగుళములు పొడవును వుండెను, ఆ జాడీపై హెబ్రీ భాషలో "LBYT YHWH" అనగా "The House of Yahweh" అని యర్థము నిచ్చు మాటలు వ్రాయబడి యున్నవి. సొలొమోను నిర్మించిన దేవాలయమును గూర్చి బైబిలులో గాక యితర స్థలములో దొరికిన మొదటి ఆధారములలో యిదొకటి.

సొలొమోను నిర్మించిన ఆలయ సామాగ్రిలో ఆసక్తి జనకమైన కళాఖండము, దానిమ్మ పండు రూపములో తయారుచేయబడిన పింగాణీ పాత్ర ఒకటి దొరికెను. అది క్రీ॥పూ 750లో రాజైన ఉజ్జియా కాలము నాటిది. ఈ చిన్న జాడీకి పొడవు పాటి మెడ యుండెను. దానిపై అంచు పుష్ప రేకులవలె చేయబడెను. ఆ జాడీపై ఈ రీతిగా చెక్కబడియుండెను : "దేవుని మందిరపు యాజకులచే అర్పింపబడిన పరిశుద్ధ బహుమతి". ఈ దానిమ్మ పండులాంటి జాడీని, యెహోవా గృహములోని Ostracon ను ఇప్పుడు మీరు ఇశ్రాయేలు దేశములోని మ్యూజియంలో చూడవచ్చును.

మరొక చారిత్రాత్మక పరిశోధన ఫలితం యేమంటే మట్టిపలకపై వ్రాసియిచ్చిన పన్ను రశీదు. "యెహోవా మందిరములో ఆరాధించువాడు మూడుషెకలులు పన్నుగా చెల్లించాలి". ఈ మాటలు క్రీ॥పూ 700లో చెక్కబడెను. దేవుని మందిరపు పనుల కొరకు ఆకాలములో ఇశ్రాయేలీయులు ఈ మొత్తమును చెల్లించేవారు. ఈ శిధిలాలు సొలొమోను నిర్మించిన ఆలయ ఉనికిని తెలియజేయు చున్నవి.

**మోయాబీయులు శిల (The Moabite Stone) :**

బైబిలు నందు చెప్పబడిన మోయాబీయులు ఉన్నారా? యని వందలాది సంవత్సరముల మట్టుకు కొందరు శంకించారు. తదుపరి మోయాబీయులు శిల ఒకటి కనగొనబడెను.

బైబిలులో ఇట్లు వ్రాయబడియున్నది :"మోయాబురాజైన మేషా అనేకమైన మందలు గలవాడై లక్ష గొర్రె పిల్లలను బొచ్చు గల లక్ష గొర్రెపొట్టేళ్లను ఇశ్రాయేలు రాజునకు పన్నుగా ఇచ్చుచుండువాడు. అయితే అహాబు మరణమైన తరువాత మోయాబు రాజు ఇశ్రాయేలు రాజు మీద తిరుగుబాటు చేసెను" (2 రాజులు 3:45).

మేషా ఇశ్రాయేలు మీద చేసిన తిరుగుబాటును గూర్చియు అతని తదుపరి సైనిక విజయములను గూర్చియు ఒక శిలా ఫలకము మీద చెక్కబడియుండెను. దీనిని మోయాబీయుల శిల అనియు, మేషాశిల అనియు చెప్పుదురు. యిది మూడున్నర అడుగుల పొడవును, రెండు అడుగుల వెడల్పును కలిగియుండెను. అది క్రీ॥పూ 850 సంవత్సరము నాటిది, అది జోర్డాను దేశములో మృత సముద్రమునకు ఇరవైమైళ్ళు తూర్పున డి బాన్ ప్రదేశములో కనుగొనబడెను. అక్షర క్రమములో చెక్కబడిన అతి పురాతన శిలాఫలకము అది. ఈ మోయాబీయుల శిలా ఫలకము ఇప్పుడు ఫ్రాన్సు దేశంలో Lourve మ్యూజి

యంలో భద్రము చేయబడి యున్నది. అది పేరిస్ పట్టణములో యున్నది.

Dr. Merrill Unger ఇట్లు చెప్పుచున్నారు : "ఈ శిలాఫలకముపై యున్న వ్రాతలు 2 రాజులు 3:4-27లో వ్రాయబడిన సంఘటనలు యదార్ధము లని సాక్ష్యమిచ్చుచు, ధృవపరచుచున్నవి." అక్షర క్రమములో వ్రాసే జ్ఞానము ఆనాడే యోర్దాను ప్రజలు కలిగియున్నారని కూడ అది రుజువు పరుచుచున్నది."

**షల్మనేసరు చతురస్రాకార స్థంభము :**

షల్మనేసరు చెక్కించిన స్థంభము చతురస్రాకారముగ నుండి ఏడడుగుల నల్ల రాయియై యుండెను. దానిపై అష్షూరు రాజైన షల్మనేసరు యొక్క విజయములను గూర్చి చెక్కబడియుండెను.

క్రీ॥పూ॥825లో ఆ నల్లటి చతు రస్రాకార శిలా స్థంభము ప్రజలకు స్మారక ముగా స్థాపించబడెను. అది ఇరాక్‌లోని ఉత్తరభాగంలో నిమ్రూద్‌లో యున్న రాజగనరులో నిలబెట్టబడెను. Sir Henry Layard అనునతడు దానిని క్రీ॥శ 1846లో కనుగొనెను. దానిపై 25 దృశ్యములు చెక్కబడి యుండెను. షల్మనేసరు ఓడించిన 5 గురు రాజులు అతనికి కప్పము చెల్లించి అతనికి సాష్టాంగ నమస్కారము చేయుచుండునట్టి దృశ్యము అందులో ఒకటి. దాని దిగువ ఇట్లు లిఖించబడియుండెను: "ఒమ్రీ కుమా రుడైన యెహూ నుండి నేను గైకొనిన కప్పము; బంగారము, వెండి , బంగారు పాత్ర ఒకటి, ఒక బంగారు జాడీ, నీళ్లు త్రాగే బంగారు గ్లాసులు, బంగారు బకెట్, బంగారు డబ్బా, రాజుకొరకొక బంగారు కర్ర మరియు బల్లెములు".

2 రాజులు 10:31-32లో ఇట్లు వ్రాయబడెను : "యరొబాము చేసిన పాపములను యెహూఏమాత్రమును విసర్జించని వాడై ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా నియమించిన ధర్మశాస్త్రమును పూర్ణహృదయముతో అనుసరించుటకు శ్రద్ధాభక్తులు లేని వాడాయెను. ఆ దినము లలో యెహోవా ఇశ్రాయేలు వారిని తగ్గించనారంభించెను".

షల్మనేసరు స్థాపించిన నల్లటి శిలా స్థంభము నుండి యెహూ ఫినిషియాతోను. యూదాతోను తన ఒప్పందమును రద్దు చేసికొనెనని మనకు తెలియుచున్నది. అటు తరువాత అతడు అష్షూరుకు లోబడిన వాడాయెను.

బైబిలు యొక్క యదార్థతను నిరూపించే వాటిలో ఈ నల్లటి షల్మనేసరు శిలా స్థంభము ఒకటి.

**సర్గోను :**

"అష్షూరు రాజైన సర్గోను తర్తానును పంపగా అతడు అష్డోదునకు వచ్చిన సంవత్సరమున అష్డోదీయులతో యుద్ధము చేసి వారిని పట్టుకొనెను" అని బైబిలు

చెప్పుచున్నది (యెష 20:1).

సర్గోను అనే రాజును గూర్చి ఎక్కడా రికార్డులలో లేనందున అట్టి రాజు లేనేలేడనికొందరు సందేహించిరి. అయితే ఇరాక్‌లో ఖోర్సాబాద్‌లో సర్గోను యొక్క రాజభవనమును పురావస్తు శాస్త్రజ్ఞులు కనుగొనిరి. ఆ రాజభవనపు గోడలపై అష్డోదును పట్టుకొన్న సందర్భము లిఖించబడి యుండెను!

**బెల్షస్సరు :**

దానియేలు గ్రంథము 5వ అధ్యాయములో గోడమీద ఒక చెయ్యి వ్రాయడం సందర్భము నీకు గుర్తుండ వచ్చును. రాజగు బెల్షస్సరు ఒక రాత్రి గొప్ప విందు చేయించుచుండగా అకస్మాత్తుగా హస్తపు వేళ్లు కనబడి దీపము దగ్గర రాజనగరు గోడపూత మీద ఏదో యొకటి వ్రాయుట అతనికి కనబడెను. ఆ వ్రాత యొక్క భావమును రాజైన బెల్షస్సరుకు దానియేలు తెలియజేయగా రాజు దానియేలుకు ఊదారంగు వస్త్రము తొడిగించి, అతని మెడలో బంగారు హారము వేయించి ప్రభుత్వము చేయుటలో అతని మూడవ అధికారిగా ప్రకటించెను (దానియే 5:29). అటు తరువాత స్వల్ప వ్యవధిలోనే కోరేషు రాజు సైన్యములు బబులోను పట్టణమును దండెత్తి పట్టుకొనిరి.

ఈ సంఘటన ఎన్నడు జరుగలేదని చరిత్రకారులు వాదించారు. బబులోను రికార్డుల ప్రకారము బెల్షస్సరు కాదు గాని నబోనిడస్ అనువాడు బబులోను రాజై యుండెను. అందువలన బైబిలు తప్పు చెప్పుచున్నదని వారన్నారు. బెల్షస్సరు అనే రాజును గూర్చిన రికార్డు ఎక్కడా లేదు.

అయితే నబోనిడస్ 'ఊరు' దేవతకు నిర్మించిన ఆలయ గోడపై చెక్కబడిన వ్రాతలు కనుగొనబడెను. అందులో ఇట్లు వ్రాయబడియున్నది. "నబోనిడస్ అనునేను, బబులోను రాజును, నీకు వ్యతిరేకముగా పాపము చేయకుందును గాక, నా ప్రథమ కుమారుడును, ఇష్టపుత్రుడునైన బెల్షస్సరు యొక్క హృదయంలో నీ యెడల భక్తి భావములు ఎల్లవేళల ఉండును గాక."

"పెర్షియా భాషలో నబోనిడస్ యొక్క వృత్తాంతములు" అను ఒక శిలాఫలకము ప్రకారము నబోనిడస్ దూర ప్రయాణమునకు పోయి బెల్షస్సరును సైన్యముపైని అధికారిగానుతన రాజరికమును అతని కప్పగించెను". అందువలననే తాత్కాలిక రాజైన బెల్షస్సరు దానియేలును తన రాజ్యములో మూడవ అధికారిగా నియమించ గలిగెను (దాని 5:16). ఈ రీతిగా పురావస్తు శాస్త్రము బైబిలు యొక్క చారిత్రాత్మక యదార్థతను నిరూపించినది.

కోరేషు యొక్క వర్తులాకార స్థంభము

(The Cyrus Cylinder) :

క్రీ॥పూ॥ 539 అక్టోబరులో పర్షియా దేశపు సైన్యములు అతిసునాయసముగా, ప్రతిఘటన యేమీ లేకుండా బబులోను పట్టణములో ప్రవేశించెను. కొన్ని దినముల తరువాత రాజైన కోరేషు తానే స్వయముగా బబులోనులో ప్రవే శించి, "బబులోను రాజు సుమేర్ మరియు అక్కాడు రాజు, భూనలు మూలలకు రాజును" అని తన్నుతాను ప్రకటించుకొనెను.

కోరేషు విశాల హృదయుడైన రాజు. అతడు బబులోను సింహాసనము నధిష్టించిన వెంటనే, బానిసలుగా పట్టు బడియున్న వారందరు, యూదులతో సహా అందరు తమ తమ స్వదేశములకు తిరిగి వెళ్లుటకు ఒక శాసనము జారీ చేసెను. ఈ శాసనమును గూర్చి ప్రవక్తయైన యెషయా ముందుగనే ప్రవచించెను (యెష 45:13). అది 2వ దిన వృత్తాంతములు 36:22-23లో వ్రాయబడియున్నది.

ఆశాసనము ఒక వర్తులాకార శిలా స్థంభముపై చెక్కించబడెను. క్రీ॥పూ 1879లో పురావస్తు శాస్త్రజ్ఞుడగు హొర్ముజ్డ్ రాస్వమ్ (Hormuzd Raswsam) బబులోను మార్దుక్ దేవాలయ పునాదులలో ఆ వర్తులాకార శిలా ఫలకమును కనుగొనెను. ఈ పురాతన ఫలకముపై ఇట్లు వ్రాయబడెను: "యిది వరకున్న నివాసులందరినీ పోగుచేసి వారిని తమ స్వదేశములకు వెళుటకు అనుమతినిచ్చితిని". కోరేషు యొక్క ఈ వర్తులాకార స్థూపము ఇప్పుడు బ్రిటీషు మ్యూజియం, లండన్‌లో యున్నది.

మరియొక సారి బైబిలు నమ్మదగినదని పురావస్తు శాస్త్రము నిరూపించినది.

**రాజుల పేర్లు :**

భాషా ప్రవీణుడగు డిక్ విల్సన్ అనునతడు ఐగుప్తు, అష్షూరు, బబులోను, పర్షియా దేశముల 29 మంది రాజులనుగూర్చి స్టడీ చేసాడు. వీరందరి పేర్లు పాతనిబంధనలోనే గాక, చరిత్రలో కూడ వ్రాయబడి యున్నాయి. తాను పఠించిన 29 మంది రాజుల యొక్క పేర్లు హెబ్రీ భాషలో అక్షర దోషము యేమీ లేకుండా ఆయా స్మారకములపై వ్రాయబడి యుండెను. బైబిలో చెప్పబడిన క్రమ ప్రకారము, అది చెప్పుచున్న సమయములలోనే ఆయా రాజులు పాలించిరని అతడు కనుగొనెను.

అయితే ఈజిప్టులో అలెగ్జాండ్రియా లైబ్రరీలో చెప్పబడిన 38 మంది రాజులలో నలుగురు మాత్రమే గుర్తింప గలవిగా యుండెనని విల్సన్ కనుగొనెను. టోలెమ అనునతడు 18 మంది రాజులను గూర్చి చెప్పెను. వారిలో ఒక్కని పేరు కూడ సరిగా

వ్రాయబడలేదు. ఇంకో ఆరు పురాతన లిస్టులలో కూడ అదే సంగతి. పాత నిబంధన ఒక్కటి మాత్రమే ఎవ్విధమైన దోషము లేకుండా యున్న పురాతన గ్రంధమని వాస్త్త శాస్త్రము నిరూపించుచున్నదని విల్సన్ అనునతడు ముగింపుకు వచ్చెను. దాని రికార్డు ఖచ్చితం, దోష రహితం.

బైబిలు కట్టుకధలు పుస్తకం కాదు. అది నిజమైన ప్రజల నిజసంఘటనల ఖచ్చితమైన రికార్డు. బైబిలు చారిత్రాత్మ కముగా యదార్ధమని నమ్మదగిన గ్రంధమని పురావస్తు శాస్త్రము యొక్క ఋజువులు చాటుచున్నాయి.

## దేవుడు క్షమించుటకు సిద్ధముగా యున్నారు
## (God is ready to Forgive)

పరమందొక దేవుడున్నారు! ఆయన ఎట్లుంటారు? దేవుడు దయా దాక్షిణ్యములు, కృపగల దేవుడని వర్ణిం చాము మరియు ఆయన క్షమించుటకు ఇష్టపడుచు సిద్ధముగ్గా యున్నారని లేఖన ములనుండి రుజువులను పొందు పరచాము.

**క్షమాపణను గ్రహించుటకష్టం :**

దీనిని గ్రహించుట కష్టం. మానవుడు అపరాధ భావముతో యుగముల తరబడి సతమతవుచున్నాడు. మానవుడు పాపము చేయగా తాను క్షమించబడుట, తన పాపములు క్షమించ బడుట దుర్లభమనే భావముతో యున్నాడు. తన పాపములను బట్టి ఉగ్రతకుబదులు క్షమాపణను, ప్రేమను దయను పొందుట కష్టమని తలస్తాడు. అందు వలననే కొందరు తమ బిడ్డలను సయితము బలియిచ్చుటకు సిద్ధపడ్డారు. త ద్వారా దేవుని ఉగ్రత ఉపశమింప జేయబడునను కొంటారు. మరి కొందరు తమ పాపముల విషయమై పశ్చాత్తాపపడు చున్నట్లగు పడుటకు తమ శరీరాలను గాయపరచు కొంటారు, నిప్పులమీద నడుస్తారు. ముండ్ల మీద పండు కొంటారు. అయితే దేవుని నుండి క్షమాపణపొందుట అసాధ్యంయేమీా కాదు.

**రక్షించుటకే క్రీస్తు ఈ లోకానికి వచ్చారు :**

దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చినపుడు "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెనని" చెప్పారు (లూకా 19:10). పాపములోబడి నశించిపోవు చున్నవారిని క్రీస్తు ద్వారా దేవుడు రక్షింప

వెదకు చున్నట్లయితే అయనను కను గొనడం మనకెందుకు కష్టమవుతాది? మనం ఆయనను తడవులాడి వెదకు నిమిత్తం నిర్ణయకాలమును మన నివాస స్థలము యొక్కపొలిమేరలను ఆయన ఏర్పరచెను. అయన మనలో ఎవనికిని దూరముగా ఉండువాడు కాడు, మన మాయనయందు బ్రదుకుచున్నాము. చలించుచున్నాము, ఉనికిని కలిగి యున్నా ము (అపొకా. 17:26-27). క్రీస్తు పాపులతోను సుంకరులతోను భోజనం చేసారు. కొందరాయనను విమర్శించి నప్పుడు, "రోగులకేగాని ఆరోగ్యముగల వారికి వైద్యుడక్కరలేదు గదా. అయితే నేను పాపులను పిలువ వచ్చితిని గాని నీతిమంతులను పిలువరాలేదు. గనుక కనికరమునే కోరుచున్నాను గాని బలిని కోరను అను వాక్య భావమేమిటో మీరు వెళ్లి నేర్చుకొనుడని" ఆయన వారితో చెప్పెను (మత్తయి 9:12-13).

**క్రీస్తు తక్షణమే క్షమించెను :**

వ్యభిచారము చేయుచుండగా పట్టు బడిన యొక స్త్రీ ఒకసారి ఆయన యొద్దకు తేబడెను. మోషేధర్మ శాస్త్రప్రకారము అట్టి వారు రాళ్లతో కొట్టబడి చంప బడాలని పరిసయ్యులు ఆయనకు జ్ఞాపకం చేసారు. "అయినను నీ వేమి చెప్పుచున్నావని" పరిసయ్యులు ఆయన నడిగారు (యోహాను 8:5). దేవుని ఉగ్రతను ఆమె మీద ప్రదర్శిస్తు యేసు వెనువెంటనే ఆమెను శిక్షించలేదు. ఆమె యొక్క పాపమును బట్టి ఆయన ఆత్మలో బహుగా దు:ఖించెను. అయినను ఆయన ఆమె యెడల కరుణ కటాక్షములు కలిగియుండెను.

అందువలన ఆయన వంగి నేలమీద వ్రేలితో ఏమో వ్రాయుచుండెను. పట్టుదల వదలక పరిసయ్యులు ఆమెను గూర్చి అడుగుచుండగా, ఆయన తల యెత్తిచూచి, మీలో పాపములేనివాడు మొట్టమొదట ఆమె మీద రాయి వేయ వచ్చునని చెప్పి మరల వంగి నేల మీద వ్రాయుచుండెను. తమ అంతరాత్మలో అపరాధులమని తెలుసుకొన్న ప్రతివాడు, పెద్దవారు మొదలుకొని చిన్నవారి వరకు ఒకని వెంట ఒకడు బయటికి వెళ్లిరి. యేసు తల యెత్తి చూచి, అమ్మా, వారెక్కడ ఉన్నారు? ఎవరును నీకు శిక్ష విధిం పలేదా? అని అడిగినప్పుడు ఆమె, లేదు ప్రభువా అనెను. అందుకు యేసు నేనును నీకు శిక్షవిధింపను, నీవు వెళ్లి ఇక పాపము చేయకుమని ఆమెతో చెప్పెను (యోహాను 8:3-11).

ఆమె అనేక దినములు తపస్సు చేసి తన శరీరాన్ని శిక్షించుకోవాలని క్రీస్తు ఆమెకు చెప్పలేదు, లేదా ఉపవాసముండి, యేడ్చి క్షమాపణ కొరకు ప్రార్థించాలని చెప్పలేదు. ఆమె పశ్చాత్తాప్త రాలైనట్లు ఆయన ఎరుగును. ఆయన కృపకలిగి

వెంటనే ఆమెను క్షమించెను. నీవు పోయి ఇక పాపము చేయకుమని ఆయన చెప్పెను. "నేను వారికి చేయనుద్దేశించిన కీడంతటిని గూర్చి వారు విని పశ్చాత్తాపపడుదురేమోయని" దేవుడు కాంక్షించుచున్నారు (యిర్మీయా 36:3). దేవుడు "కృపా క్షమాపణలు గలదేవుడై యున్నాడు" అని దానియేలు 9:9చెప్పు చున్నది.

యేసు సిలువ వేయ బడినప్పుడు ఇద్దరు దొంగలు కూడ ఆయనతో సిలువ వేయబడిరి. వారిలో ఒకడు వేదనతో ఆయనను చూచి "యేసు –నీరాజ్యము లోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుమనెను" (లూకా 23:42).యేసు సంశయపడలేదు. వాని పాపములకు ఆచివరి గడియలలో క్షమాపణ అసాధ్య మని చెప్పలేదు గాని ఆయన వెంటనే "వానితో నేడు నీవునాతో కూడ పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచు న్నాననెను"(లూకా 23:43).

**క్రీస్తును చంపిన హంతకులు ఒక్కరోజే క్షమించబడ్డారు :**

యూదులు, అన్యజనులు కూడ యేసును చంపారు (లూకా 18:32–33). యేసు పునరుత్థానుడైన 50 దినముల తరువాత అపొస్తలుడైన పేతురు , "ఈ యనను మీరు దుష్టుల చేత సిలువ వేయించి చంపితిరియని" చెప్పాడు (అపొ.కా. 2.23). హత్య చేయడం పాపము, మరియు దేవుని కుమారుని చంపించడం ఘోరపాపం. నిజానికి అట్టిపాపులు తమ వస్త్రములు చింపుకొని, దినముల తరబడి ఉపవాసముండి క్షమాపణను వేడుకొనాలని చెప్పబడియుండాలి, గాని వారికి అట్లు చెప్పబడలేదు, వారు తమ హృదయములో నొచ్చుకొని, అయ్యలారా, రక్షణ పొందుటకు మేమేమి చేతుమని అడుగగా. " మీరు మారు మనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అనువరమును పొందుదురు" అని పేతురు వారికి చెప్పెను. పేతురు ఇంకను అనేక విధములైన మాటలతో సాక్ష్యమిచ్చి మీరు మూర్ఖులగు ఈ తరము వారికి వేరై రక్షణ పొందుడని వారిని హెచ్చరించెను. కాబట్టి అతని వాక్యము అంగీకరించిన వారు బాప్తిస్మముపొందిరి. ఆదినమందు ఇంచుమించు మూడు వేలమంది చేర్చబడిరి (అపొ. కా. 2:38–41).

క్రీస్తు హత్య విషయంలో అపరాధులైన వీరు వేదనతో దు:ఖించాలని చెప్పబడలేదు. కనీసం వారు ప్రార్థించాలని కూడ చెప్పబడలేదు. సరిగదా కొంతకాలం కనిపెట్టాలని

కూడా వారికి చెప్పబడలేదు. ఏదో అసాధ్యమైన దానిని వారు చేయాలని కూడ వారికి చెప్పబడలేదు. వారు ఘోరపాపం చేసారు, నిజమే. వారి పాపమును గూర్చి పేతురు చెప్పగా వారు తమ హృదయంలో నొచ్చుకొన్నారు. వారు దేవుని ఏకైక కుమారుని చంపినప్పుడు దేవుడు బహుగా దు:ఖించాడు నిజమే. గాని వారిని క్షమించుటకు ఆయన సిద్ధముగా యున్నారు. క్రీస్తు కూడ సిలువ మీద వ్రేలాడుచు, "తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని ప్రార్థించారు (లూకా 23:34). వారి అపరాధమును గూర్చి వారికి తెలియజేయబడినప్పుడు ఇంచు మించు మూడు వేలమంది మారుమనస్సు పొందారు. ఆశ్చర్య మేమంటే, " ఈ వాగ్దానము మీకును మీ పిల్లలకును దూరస్థులందరికిని అనగా ప్రభువైన మన దేవుడు తన యొద్దకు పిలిచిన వారికందరికిని చెందునని" చెప్పబడింది (అపొ.కా. 2:39). గనుక ఈ రోజు పాపులు మారుమనస్సు పొంది, క్రీస్తునామమున బాప్తిస్మము పొందితే, తమ పాపముల క్షమాపణను పొందుదురు, మరియు పరిశుద్ధాత్మ వరమును కూడ పొందుదురు. ఆప్రజలు తమ ఘోరపాపము లక్షమాపణను ఒకే రోజులో పొందగలిగితే ఈనాడు మనము కూడ ఒకేరోజులో పొందగలము.

**మార్పునొందిన వారందరు సంతోషించిరి :**

యేసు ప్రభువు పునరుత్థానుడైన తరువాత అపొస్తలులకార్యముల గ్రంథములో మార్పునొందిన వారందరు క్షమాపణను, రక్షణను తక్షణమే పొందారు. అపొ.కా. 8:12-13. ఇట్లు చెప్పుచున్నది. "అయితే ఫిలిప్పు దేవుని రాజ్యమును గూర్చియు, యేసుక్రీస్తు నామమును గూర్చియుసువార్త ప్రకటించుచుండగా వారతని నమ్మి పురుషులును స్త్రీలును బాప్తిస్మము పొందిరి. అప్పుడు సీమోను కూడ నమ్మి బాప్తిస్మము పొంది ఫిలిప్పును ఎడబాయ కుండెను......."

ఐతియొపీయ నపుంసకుడు తన విశ్వాసమును ఒప్పుకొని బాప్తిస్మము పొందినపుడు సంతోషముతో తన త్రోవలో వెళ్లెను (అపొ.కా. 8:36). క్రైస్తవులను ఘోరంగా హింసించుచున్న తార్సువాడైన సౌలుకు ప్రభువు కన్పడినప్పుడు, అతడు నేలమీద పడి వణకుచు, "ప్రభువా నేనేమి చేయ వలెనని" అడిగెను (అపొ.కా. 9:6). నీవు లేచి పట్టణములోనికి వెళుము, అక్కడనీకు తెలియజేయబడునని అతనికి చెప్పబడెను. తదుపరి సువార్తికుడైన అననీయ వచ్చి, "నీవు తడవు చేయుట ఎందుకు ? లేచి ఆయన నామమును బట్టి

ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీపాపము లను కడిగివేసుకొనుమని" అతనికి చెప్పెను (అపో.కా. 22:16).నీవు తడవు చేయుట ఎందుకు? అనేమాటలను గమనించుము సౌలులేచి బాప్తిస్మము పొందినవెంటనే అతనికి క్షమాపణలభించెను.

అపో.కా. 16:30-33లో ఫిలిప్ప యి చెరసాల అధిపతి, " అయ్యలారా రక్షణపొందుటకు నేనేమి చేయవలెననెను. అందుకు వారు (పౌలు, సీలాలు) ప్రభువైన యేసు నందు విశ్వాసముం చుము, అప్పుడు నీవును నీయింటివారును రక్షణ పొందుదురని చెప్పి అతనికిని అతని యింటనున్న వారందరికిని దేవుని వాక్యము బోధించిరి, రాత్రి ఆగడియలోనే అతడు వారిని తీసికొని వచ్చి వారిగాయ ములు కడిగెను, వెంటనే అతడును అతని ఇంటివారందరును బాప్తిస్మము పొందిరి". వారు వెంటనే బాప్తిస్మము పొందిరను సంగతి గమనించుము, వారు కనిపెట్ట లేదు. వారు నమ్మి బాప్తిస్మము పొందిన వెంటనే వారిని క్షమించుటకు దేవుడు సిద్ధముగా యుండెను, వారు రక్షింపబడిరి. "నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింపబడునని" ప్రభువు చెప్పారు (మార్కు 16:16).

గనుక మిత్రుండా ఆయన మాటలను నమ్ముము, క్షమించుటకు దేవుడు ఎల్లప్పుడు నంసిద్ధము గా యున్నారు. బైబిలు ఈ సత్యముతో నిండి యున్నది!.

**గమనిక :**

**సత్యవాణి T.V. కార్యక్రమములను**
**ప్రతి బుధవారము సాయంత్రం 6:30 గంటలకు**
**రక్షణ ఛానల్ లోను, శనివారం ఉదయం 8 గంటలకు**
**ఆరాధన ఛానల్ లోను, మరియు ఆదివారం సాయంత్రం 6:00**
**గంటలకు శుభవార్త ఛానల్‌లోను చూడండి.**

సత్యవాక్కు మాస పత్రిక కావాలంటే
సంవత్సరమునకు 50/- రూ॥లు చెల్లించవలెను

**మీ అడ్రసు లో మార్పు వస్తే సత్యవాక్కు చందా దారుల మీ నంబరును తెలియజేయండి**

**స్థానిక సంఘాభివృద్ధి:**

# పెద్దలు, వారి స్థానము అర్హతలు

ప్రతి సంస్థలోను దానిని పర్యవేక్షించుటకు అధికారముగల వారుండుట అతిప్రాముఖ్యము. క్రీస్తు ప్రభువు సంఘములో వారు అధ్యక్షులు (Bishops) లేక పెద్దలు (Elders) లేక కాపరులు (Pastors) అని పిలువ బడ్డారు. గనుక వీరితో స్థానిక సంఘాభివృద్ధిని గూర్చి పరిఓంచుట ప్రాముఖ్యము.

**ప్రతిస్థానిక సంఘములోను ఒకరికంటే ఎక్కువ పెద్దలుంటారు:**

క్రొత్త నిబంధన సంఘములో పెద్దలున్నారనేది నిర్వివాదాంశము. పౌలు బర్నబాలు "ప్రతి సంఘములో వారికి పెద్దలను ఏర్పరచి, ఉపవాసముండి ప్రార్ధన చేసి వారు నమ్మిన ప్రభువుకు వారిని అప్పగించిరి"యని అపొ.కా. 14:23లో చూడగలము. "నేను నీకాజ్ఞాపించిన ప్రకారము నీవు లోపముగా ఉన్నవాటిని దిద్ది ప్రతి పట్టణములోను పెద్దలను నియమించు నిమిత్తమే నేను క్రేతులో నిన్ను విడిచివచ్చితినని" పౌలు తీతుకు వ్రాసాడు (తీతు 1:5). ఫిలిప్పీయులకు వ్రాస్తు "ఫిలిప్పీలో ఉన్న క్రీస్తు యేసునందలి సకల పరిశుద్ధులకును అధ్యక్షులకును పరిచారకులకును క్రీస్తు దాసుడైన పౌలు వ్రాయునది" యని అతడు వ్రాసాడు (ఫిలిప్పీ 1:1). ఈ లేఖనములను బట్టి ప్రతి సంఘములోను పెద్దలుండిరియని గ్రాహ్యమగుచున్నది

**పెద్దలను వర్ణించుటకు ఉపయోగించిన పదములు:**

క్రొత్త నిబంధన సంఘములో పెద్దలు, అధ్యక్షులు కాపరులు అను మాటలు ఒకే పదవికి వర్తించును. అపొ.కా. 20:17లో "అతడు (పౌలు) మిలేతునుండి ఎఫెసునకు వర్తమానము పంపి సంఘపు పెద్దలను పిలిపించెను" అని వ్రాయబడియున్నది. ఇక్కడ పెద్దలు అనుమాట 'ప్రెస్బిటర్లు' అను ఆదిమ పదము నుండి అనువదించబడినది. ప్రెస్బిటర్లు అనగా వయస్సులోను అనుభవంలోను పరిపక్వత కలిగిన వారని యర్ధము. ఈ పెద్దలు తన యొద్దకురాగా పౌలు "దేవుడు తన స్వరక్త మిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులనుగా ఉంచెనో ఆయావత్తు మందను గూర్చియు మీ మట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి"యని చెప్పెను

(అపొ.కా. 20:28). ఈ పెద్దలనే అతడు అధ్యక్షులని సంబోధించెను. అధ్యక్షులనగా పర్యవేక్షించువారని యర్థము. సంఘమును కాయుట అనుపదముPoimaino అనుపదమునుండి వచ్చినది. అనగా కేవలము ఆహారము నందించుట మాత్రమే గాక ఇంకా బహుళ భావము కలిగియున్నది. కావలాకాయుట, సంరక్షించుటయని దాని అర్థము. దీనినుండే Pastor అను పదము వచ్చినది.

అధక్ష్యుడు లేక బిషప్ అనుపదము Epi, skopos అను పదముల నుండి వచ్చినది. అంటే పర్యవేక్షించుటయని అర్థము. పెద్దలు లేక అధ్యక్షులు సంఘ మును పర్యవేక్షింతురు. ఈ పదము లన్నిటిని బట్టి ఆ పదవిలో యున్నవారు స్థానిక సంఘము యొక్క ఆత్మీయ క్షేమ మును పర్యవేక్షిం చువారని తెలిసికో గలము. వారు వయసులో పెద్ద వారను కొంటే వారు పెద్దలు. వారు పర్యవేక్షించు వారనుకుంటే వారు అధ్యక్షులు . వారు సంఘమును కాయువారను కొంటే సంఘకాపరులు, ఎట్లయినను వారందరు ఒక్కటే. క్రొత్త నిబంధన ప్రకారము ఒకే సంఘములో ఒకే పెద్దగాని, పాస్టరుగాని లేదు. యాభైసంఘాలపై బిషప్పులేదు. ప్రతి స్థానిక సంఘములోను ఒకరికంటె ఎక్కువ పెద్దలు కలిగియుండిరి.

**పెద్దల అర్హతలు :**

అపొ.పౌలు పెద్దలకుండవలసిన 23 అర్హతలను గూర్చి చెప్పాడు. పెద్దలైన వారు అన్ని విషయాల్లో పరిపూర్ణులు కారని మనం గ్రహించుకోవాలి. దేవుని నియమాలన్నీ పరిపూర్ణమైనవి. "మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండెదరు" అని ఆయన చెప్పారు (మత్తయి 5:48). పెద్దలుగా యుండగోరువారి అర్హతలును పౌలు ఇట్లు వివరించాడు :

"ఎవడైనను అధ్యక్షపదవిని ఆశించిన యెడల అట్టి వాడు దొడ్డపనిని అపేక్షించుచున్నాడు. అధ్యక్షుడగు వాడు నిందారహితుడును ఏకపత్నీ పురుషుడును మితానుభవుడును స్వస్థబుద్ధి గలవాడును, మర్యాదస్థుడును, మద్యపానియు కొట్టువాడునుకాక సాత్వికుడును జగడమాడని వాడును ధనాపేక్షలేని వాడునై సంపూర్ణమాన్యత కలిగి తన పిల్లలను స్వాధీనపరచుకొనుచు తన యింటి వారిని బాగుగా ఏలువాడునై యుండవలెను. ఎవడైనను తన యింటి వారిని ఏలనేరకపోయిన యెడల అతడు దేవుని సంఘమును ఏలాగు పాలించును? అతడు గర్వాంధుడై అపవాదికి కలిగిన శిక్షావిధికి లోబడకుండునట్లు క్రొత్తగా

చేరిన వాడై యుండకూడదు. మరియు అతడు నిందపాలై అపవాది ఉరిలో పడిపోకుండునట్లు సంఘమునకు వెలుపటి వారి చేత మంచి సాక్ష్యము పొందినవాడై యుండవలెను. ఆలాగుననే పరిచారకులును మాన్యులై యుండి ద్విమనస్కులును మిగుల మద్యపానాసక్తులును దుర్లాభము నపేక్షించు వారునై యుండక విశ్వాసమర్మమును పవిత్రమైన మనసాక్షితో గైకొనువారై యుండవలెను. మరియు వారు మొదట పరీక్షింపబడవలెను" (1 తిమో 3:1–10).

"నేను నీకాజ్ఞాపించిన ప్రకారము నీవులోపముగా ఉన్న వాటిని దిద్ది ప్రతి పట్టణములోను పెద్దలను నియమించు నిమిత్తమే నేను క్రేతులో నిన్ను విడిచి వచ్చితిని. ఎవడైనను నిందారహితుడును ఏకపత్నీ పురుషుడును దుర్వ్యాపారము నిమిత్తము నేరము మోపబడనివాడై అవిధేయులుకాక విశ్వాసులైన పిల్లలు గలవాడునైయున్న యెడల అట్టి వానిని పెద్దగా నియమింపవచ్చును. ఎందుకనగా అధ్యక్షుడు దేవుని గృహనిర్వాహకునివలె నిందారహితుడై యుండవలెను. అతడు స్వేచ్ఛాపరుడును ముక్కోపియు మద్యపానియు కొట్టువాడును, దుర్లాభము అపేక్షించువాడును గాక అతిథిప్రియుడును, సజ్జన ప్రియుడును స్వస్థబుద్ధిగలవాడును నీతిమంతుడును పవిత్రుడును ఆశానిగ్రహముగల వాడై యుండి తాను హితబోధ విషయమై జనులను హెచ్చరించుటకును ఎదురాడు వారి మాట ఖండించుటకును శక్తి గలవాడగునట్లు ఉపదేశమునకనుసరించి నమ్మదగిన బోధను గట్టిగా చేపట్టకొనువాడునైయుండవలెను" (తీతు 1:5–9).

ప్రతి క్రైస్తవుడు పైన చెప్పిన అర్హతలన్నీ కలిగియుండవలెను. పెద్దగా యుండగోరువాడు మాత్రము ఏక పత్నీ పురుషుడై యుండాలి. క్రొత్తవాడైన ప్రతివాడు మొదట్లో అనుభవం లేనివాడే, గాని అతడు ఆ స్థితిలోనే యుండిపోకూడదు. మనం చూచిన రెండు లేఖన భాగములలోని అర్హతలను క్లుప్తముగా ఇప్పుడు పరిశీలింతము :

**నిందారహితుడు:**

పెద్దలుగా యుండగోరువారు ఏ విషయంలోను నిందింపబడకుండా సత్ప్రవర్తన కలిగియుండాలి. నిందారహితుడనగా పరిపూర్ణుడు, పాపములేనివాడని యర్థము కాదు. గాని పెద్దలైన వారిపై ఏ రకమైన నిందారోపణ చేయబడని రీతిగా వారు జీవించాలని యర్థము.

**ఏక పత్నీ పురుషుడు :**

దీనికి పలు విధాలుగా భావార్థము చెబుతారు గాని ఒకే ఒక్క భార్యను కలిగియున్న వానిని పెద్దగా ఎంపిక చేస్తే

మంచిది. ఒక అర్హత కంటే ఇంకొకటి మంచిదని చెప్పలేముగాని ఈ అర్హతను ప్రజలు గమనిస్తారు. పెద్ద యొక్క విజయవంతమైన జీవితం కొరకు యిది ప్రాముఖ్యము.

**తనయింటి వారిని బాగుగా ఏలువాడు :**

ఒక పెద్ద యొక్క కుటుంబము ప్రభువుకు ఆయన సంఘానికి నమ్మకముగా జీవించాలి. "ఎవడైనను తన యింటివారిని ఏలనేరకపోయిన యెడల అతడు దేవుని సంఘమును ఏలాగు పాలించును? అని పౌలు ప్రశ్నించాడు.ఒకడు తన కుటుంబము యెడల సత్ క్రైస్తవ నడవడిని కనుబరచని యెడల దేవుని కుటుంబము యెడల కూడ మంచిగా యుండలేడు.

**విశ్వాసులైన పిల్లలు కలిగి యుండాలి:**

యిది తీతు పత్రికలో యున్నది. అతడు "సంపూర్ణ మాన్యత కలిగి తన పిల్లలను స్వాధీన పరచుకొనుచు" యుండాలి. పిల్లలు కూడ సువార్తకు లోబడినవారై యుండాలనే సంగతి క్లియర్‌గా లేనందున, వారును అట్టి వారై యుండాలని మనం ఊహించరాదు. గాని పిల్లలు కూడ సువార్తకు లోబడి విధేయత గలవారై యుండాలి. క్రైస్తవులగుటకు తగిన వయసు గలవారు వుంటేవారు తప్పక క్రైస్తవులవ్వాలి. దీనికి కారణాలు తెలిసినవే. ఒక మనుష్యుని సొంత పిల్లలే అతని గౌరవించని యెడల, యితరులు అతన్ని గౌరవించడం జరుగదు. ఒకనికి ఎంతమంది పిల్లలు ఉండాలో చెప్పబడలేదు (ఎఫెసీ 6:1-4).

**మితానుభవుడు:**

యిది ఆత్మనిగ్రహమును సూచించుచున్నది. ఒకని జీవితమంత టికీ వర్తించును. అతని అన్నపాన ముల అలవాట్లు, సంభాషించు విధాన ము మొదలగు నవన్నీ యిందులోకి వస్తాయి. తననుతానే నిగ్రహించు కోలేనివాడు యితరులను కూడ నిగ్రహించలేడు.

**స్వస్థ బుద్ధిగలవాడు :**

పెద్దయైన వాడు చులకన సంగతులను లక్ష్యపెట్టకూడదు. చిలిపి చేష్టలుండకూడదు. అతడు ఎన్నడు నరదాగా యుండరాదని దీని యర్థము కాదు, గాని ఏకాగ్రతలేని వాడు ఉన్నత పదవిని ఆశించరాదు. దేవుని యింటిపై పర్యవేక్షించుట తీవ్రమైన పనియే.

**మర్యాదస్థుడు :**

పెద్దయైనవాని జీవితం మర్యాద పూర్వకమైనది. క్రమమైనది. అమ ర్యాద అశ్రద్ధగలవాడు, క్రమములేని వాడు దేవుని పనిని నడుపలేడు.

**అతిథి ప్రియుడు :**

పెద్దలు సుహృద్భావము, స్నేహ భావము, దయ కలిగినవారై యుండాలి. వారు సంఘస్థులందరితో స్నేహ భావము కలిగియుండాలి. యితరులను ప్రోత్సహించువారై యుండాలి. క్రైస్తవ్యము యొక్క విలువలను యితరులకు అందజేయగలవారై యుండాలి. మాటలోను క్రియలోను కూడ వారట్లు చేయాలి. అట్టివారు సంఘానికి సమాజానికి గొప్ప మేలు చేయగల్గుదురు. వారు నమ్మకాన్ని ధైర్యాన్ని కలుగజేస్తూయితరులను ప్రోత్సహించగల్గుదురు.

**బోధింపతగినవాడు :**

పెద్దలు యితరులకు బోధింప సామర్థ్యము గలవారై యుండాలి. యితరులకు క్రీస్తును గూర్చి బోధింపలేని వాడు సంఘమును పోషించలేడు. ఉపదేశమంతటిని పెద్దలే చేయలేరు గాని సంఘములో చేయబడు ఉపదేశమంతయు వారి పర్యవేక్షణలో జరగాలి. వారు బోధింప తగినవారు కాకపోతే యితరులు చేయుబోధను బోధకులను వారు విశ్లేషించలేరు.

**ముక్కోపి కాకూడదు :**

ముక్కోపియైనవాడు తన కొరకు సంఘము కొరకు శత్రువులను తయారు చేసికొనును. విచారమేమంటే అనేకమంది పెద్దలిట్లున్నారు, వారి కోపస్వభాము వలన బలహీనులైన సభ్యులను అనేక స్థానిక సంఘాలు కోల్పోతాయి. ఈ అర్హతను ఎన్నడు ఉపేక్షించ కూడదు. ముక్కోపియైనవాడు ప్రార్థనపూర్వకంగా ప్రయత్నిస్తే దానిని జయించగలడు. ఒకడు సంఘ పెద్దగా యుండగోరితే ముక్కోపాన్ని జయించాలి.

**కొట్టువాడు కాకూడదు :**

పెద్దయైనవాడు జగడగొండి కాకూడదు. అతడు జగడములను, కొట్లాటలను, అపార్థములను విసర్జించాలి. ఒకడు పెద్దగా యుండి అందరితోను వాగ్వాదములు పెట్టుకో కూడదు. సణగేవాడు, గొణిగేవాడు పెద్దగా నుండుటకు అర్హుడు కాదు.

పెద్దయైన వాడు స్వేచ్ఛాపరుడు కాకూడదు. యితరుల పొరబాట్లను ఎల్లవేళలా ఎంచువాడు కాకూడదు . అతడు ఎన్నడు హింసను ప్రోత్సహించ రాదు.

పెద్దయైనవాడు మర్యాదస్థుడు. సాదువైనవాడు, శాంతి కాముకుడు, అహంభావము లేనివాడు.

**జగడమాడని వాడు :**

పెద్దయైన వాడు తన అభిప్రాయన్నే యితరులపై బలవంతముగా రుద్దకూడదు. అతడు సాత్వికుడు, మృదువైన స్వభావముగలవాడు. దీనికి

పై రెండు అర్హతలకు దగ్గర సంబంధమున్నది. గనుక పెద్దయైనవాడు. జగడగొండి కాకూడదు. పోట్లాడకూడదు, కలహాము లకు పోకూడదు. కొంతమందికి ప్రగాఢ విశ్వాసముండవచ్చును గాని, ఎవరో ఒక రితో వారు వాగ్వాదము పెట్టుకొంటారు. అట్టివారు పెద్దలుగా యుంటే స్థానిక సంఘము పాడైపోతాది.

**ధనాపేక్షలేనివాడు :** పెద్దయైనవాడు లోభికాకూడదు, ధనాన్ని ప్రేమింపరాదు. ధనార్జన మీదనే తన లక్ష్యాన్ని పెట్టుకొన్న వానికి దేవుని సంఘముపై కాపరిగా యుండుటకు సమయంవుండదు, కోరికా యుండదు. ధనాపేక్షను విగ్రహారాధన యని పౌలు చెప్పుచున్నాడు. ధనాపేక్ష గలవాని మనస్సు మంచిదికాదు. ధనాపేక్ష వలన అతడనేక పాపములకు గురి యౌతాడు. నిజంగా ధనాపేక్ష సమస్త కీడులకు మూలము (1 తిమోతి 6:10).

**క్రొత్తగా చేరినవాడు కాకూడదు :**

క్రొత్తగా క్రైస్తవుడైన వానినెన్నడు సంఘపెద్దలలో చేర్చకూడదు. అతడు దేవుని వాక్యము యెడల తన నమ్మకత్వాన్ని నిరూపించుకొన్నవాడు కావాలి, పరీక్షింపబడినవాడు కావాలి. తన విశ్వాసాన్ని బట్టి అందరు అతని సమర్థి స్తారు.

**వెలుపటివారిచే మంచి సాక్ష్యము పొందినవాడు :**

యితరులు మనలను గూర్చి యేమనుకొనుచున్నారో అది ప్రాము ఖ్యము. తన్ను ఎరిగినవారి దగ్గర మంచి పేరులేని వాడు మంచికొరకు పలుకుబడి లేనివాడు. బయటవారిచేత కూడ ప్రశ్నింపతగిన ప్రవర్తన గలవానిని ఎన్నడు పెద్దలలో చేర్చకూడదు.

**గర్వాంధుడు కాకూడదు :**

యిది తరుచు నిర్లక్ష్యము చేయబడుచున్న అర్హత. గర్వాంధులైన అనేకులు పెద్దలుగా యుండుటకు ప్రయత్నం చేస్తారు. ఆదిమ సంఘములో దీనివలననే భ్రష్టత్వము మొదలిడెను. ఈ దుష్ట లక్షణమునకు సాదృశ్యముగా దియొత్రేఫే మనకు కనబడుచున్నాడు. అతడు సంఘములో ప్రధానత్వము కోరుచు, చెడ్డమాటలు వదరుచు, సహోదరులను కలవరపరిచాడు (3 యోహాను :9). యిట్టి లక్షణము నుండే పోపుల ఏలుబడి మొదలిడినది. పెద్దలుగా యుండగోరువారికి గర్వాంధకారము ఉండరాదు. పెద్దయైన వాడు యితరుల మనోభావాలను, హక్కులను అవుసరాలను ఎరిగియుండి వాటిని గౌరవించువాడై యుండాలి.

-L.R. విల్సన్

రాజుగారు వందన సమర్పణ చేయగా ముగింపు ప్రార్థనతో ఆనాటి కార్యక్రమము ముగిసెను. హాజరైన వారందరికీ మంచి విందు ఏర్పాటు చేయబడెను. దేవుడు విశాఖ వేలీ బైబిలు కాలేజీని తననామ మహిమార్థమై వాడుకొనునుగాక.

2011 ఏప్రియల్ 15వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట గోపాల్‌నగర్‌లో యున్న క్రీస్తు సంఘమును సోదరులు జెర్రీ బేట్స్ గారును జాషువాగూటం గారును దర్శించి వాక్య పరిచర్య చేసిరి. అక్కడ సోదరులు డేవిడ్ రాజుగారు సువార్తచాటుచున్నారు.

ఏప్రియల్ 15 వతేదీ శుక్రవారం రాత్రి రామచంద్రపురం పదం పేటలో యున్న క్రీస్తు సంఘము వారు జరిగించుచున్న మూడు రోజుల సువార్త కూటములో జెర్రీ బేట్స్‌గారు గంభీరమైన ప్రసంగము చేసిరి. ఆ కూటమునకు వందలాది మంది హాజరై దేవుని వాక్యమును ఆసక్తితో ఆలకించిరి. పదం పేటలో సోదరులు యన్. ప్రసాద్ గారు గంభీరమైన పనిని దేవుని కొరకు చేయుచున్నారు. కుమ్మరవీధిలో యున్న తమ ఆలయమును విస్తరించి దానిని చక్కగా తీర్చి దిద్దిరి. జాషువా గూటం దంపతులు, జెర్రీ బేట్స్ దంపతులు ప్రసాద్‌గారిని, వారి స్థానిక సంఘమును ఎంతగానో అభినందించిరి. 15వ తేదీ,రాత్రి జరిగిన కూటమునకు సోదరులు సుగుణరావు (దొంతమూరు) అధ్యక్ష తవహించిరి. సోదరులు దేసింగ్ గారు ప్రార్ధనలలోను తదితర కార్యక్రమములలోను సహకరించిరి. స్థానికసంఘయువతీ యువకులు ఎంతగానో శ్రమించి ఆ మూడు రోజులు కూటములను జయ ప్రదము గావించిరి. 16వ తేదీ సాయంత్రం కాకినాడ స్థానిక సంఘములోను, 17వ తేదీ ఆదివారం ఉదయం ఆరాధన సమయములోను జెర్రీబేట్స్ గారు చక్కటి వాక్యపరిచర్యచేసిరి. ఒక్క యువకుడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందెను.

2011 ఏప్రియల్ 16వ తేదీ శనివారం ఉదయం వాడపల్రులో యున్న క్రీస్తు సంఘమును జెర్రీబేట్స్ గారును. పాలా బేట్స్ గారును దర్శించి వార్యపరిచర్య చేసిరి. అక్కడ సోదరులు డి.రంగారావు గారు సువార్తచాటుచున్నారు. తదుపరి సోదరులు గున్నే పల్లి వెళ్లి అక్కడ ఆలయము నిర్మించదలచిన స్థలమును పర్యవేక్షించిరి. అక్కడనుండి పెనుగుదురు వెళ్లి నిర్మాణములో యున్న స్థానిక సంఘ ఆలయమును దర్శించిరి. పెనుగుదురులో ఆలయ నిర్మాణపని తర్వలో పూర్తియగునట్లు జెర్సీబేట్స్ గారు ప్రార్థించిరి. జరుగుచున్న ఆలయ నిర్మాణ పనిని బట్టి స్థానిక సంఘస్థులు దేవుని స్తుతించిరి. పెనుగుదురులో సోదరులు దారా నాని గారు చాలా కాలముగా సువార్త చాటుచున్నారు.

18వ తేదీ ఉదయం జెర్సీబేట్స్ దంపతులు రాజమండ్రి, చెన్నై, కోయంబత్తూరుల మీదుగా అమెరికా బయలుదేరిరి.

**RNI Regd. No. 69973/98**
**Postal Regd. No. VM/KD/02/2009-11**

To

From:

**SATYA VAKKU**
**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004